# కరెంట్ అఫైర్స్

## కొలువుదీరిన తెలంగాణ శాసనసభ

★ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత ఏర్పడిన రెండో శాసనసభ సమావేశాలు 2019, జనవరి 17న ప్రారంభమయ్యాయి. ప్రొటెంస్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా మొత్తం 114 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో ప్రమాణం చేయించారు. వివిధ పక్షాలకు చెందిన అయిదుగురు ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారానికి హాజరు కాలేదు. తెలంగాణ అసెంబ్లీకి 119 మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. ఆంగ్లో ఇండియన్ కోటా కింద ఎమ్మెల్యేగా ఎన్నికైన స్టీఫెన్‌సన్‌తో కలిపి మొత్తం సభ్యుల సంఖ్య 120.

★ సభలో అత్యంత సీనియర్ సభ్యుడు ముఖ్యమంత్రి కేసీఆర్. ఇప్పటి వరకూ ఆయన ఉప ఎన్నికతోపాటు ఎనిమిదిసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు.

★ తెలంగాణ రెండో శాసనసభ స్పీకర్‌గా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి జనవరి 18న బాధ్యతలు చేపట్టారు.

## ముగ్గురు భారతీయ అమెరికన్లకు కీలక పదవులు

★ ముగ్గురు భారత సంతతి అమెరికన్లను అత్యంత ప్రాధాన్యమైన మూడు విభాగాలకు 2019, జనవరి 16న అధ్యక్షుడు ట్రంప్ నామినేట్ చేశారు.

★ ప్రస్తుతం గేట్‌వే ఫర్ యాక్సలరేటెడ్ ఇన్నోవేషన్ ఇన్ న్యూక్లియర్ (గెయిన్) డైరెక్టర్‌గా ఉన్న రీటా బరన్వాల్‌ను ఇంధన శాఖ (అణు ఇంధన) అసిస్టెంట్ సెక్రటరీగా, న్యాయవాద అధ్యాపకుడిగా ఉన్న ఆదిత్య బంజాయ్‌ను ప్రైవసీ అండ్ సివిల్ లిబర్టీస్ ఓవర్‌సైట్ బోర్డు సభ్యుడిగా, ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఓవర్‌సైట్ కౌన్సిల్‌లో డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీగా ఉన్న బిమల్ పటేల్‌ను ట్రెజరీ అసిస్టెంట్ సెక్రటరీగా నియమించేందుకు ట్రంప్ ప్రతిపాదించారు.

★ ఇప్పటివరకు ట్రంప్ 36 మందికి పైగా భారతీయ అమెరికన్లను కీలక స్థానాల్లో నియమించారు.

## ఏపీ ఎన్నికల ప్రధానాధికారిగా గోపాలకృష్ణ ద్వివేది

★ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారిగా పనిచేస్తున్న రామ్‌ప్రకాష్ సిసోడియాను కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ఆయన స్థానంలో 1993 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ ద్వివేదిని నియమిస్తూ 2019, జనవరి 17న ఉత్తర్వులు జారీ చేసింది. ద్వివేది అదే రోజున బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన తూర్పుగోదావరి జిల్లా కలెక్టరుగా పనిచేశారు.

## రూ.10,000 కోట్ల త్రైమాసిక లాభం

★ రూ. 10,000 కోట్ల త్రైమాసిక లాభాన్ని పొందిన తొలి భారత ప్రైవేటురంగ కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అవతరించింది. చమురు నుంచి టెలికాం దాకా సేవలందించే ఈ దిగ్గజం అక్టోబరు - డిసెంబరు 2018లో రూ. 10,251 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది.

★ ఇప్పటి వరకు దేశంలో ఏ ప్రైవేటు కంపెనీ కూడా రూ. 10,000 కోట్లకు పైగా లాభాన్ని ప్రకటించలేదు. ప్రభుత్వరంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) జనవరి - మార్చి 2013లో రూ. 14,512.81 కోట్ల లాభాన్ని ప్రకటించింది. భారత కార్పొరేట్ చరిత్రలో ఇదే అత్యధిక త్రైమాసిక లాభం.

## యోహీ ససకావాకు గాంధీ శాంతి బహుమతి

★ 2015, 2016, 2017, 2018 సంవత్సరాలకుగాను ప్రతిష్ఠాత్మక గాంధీ శాంతి బహుమతి విజేతలను 2019, జనవరి 16న కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గాంధీ బోధించిన అహింసామార్గంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పును తీసుకురావడంలో విశేషకృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డును అందజేస్తారు.

★ నిప్పన్ ఫౌండేషన్ ఛైర్మన్ యోహీ ససకావా 2018 సంవత్సరానికి ఈ అవార్డును గెలుచుకున్నారు. ఈయన ప్రపంచ ఆరోగ్య సంస్థ తరపున ప్రపంచ వ్యాప్తంగా కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేస్తున్నారు.

★ 2015 సంవత్సరానికిగాను కన్యాకుమారిలోని వివేకానంద కేంద్ర, 2016 సంవత్సరానికిగాను అక్షయ పాత్ర ఫౌండేషన్, సులభ్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా, 2017కుగాను ఏకై అభియాన్ ట్రస్ట్‌లు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి.

★ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని జ్యూరీ ఈ అవార్డులను ప్రకటించింది. సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, లోక్‌సభలో ప్రతిపక్షనేత మల్లిఖార్జున్ ఖర్గే, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అడ్వాణీలు ఈ జ్యూరీలోని మిగతా సభ్యులు.

★ 1995 నుంచి ఈ అవార్డును ఇస్తున్నారు. విజేతలకు ఈ అవార్డుతో పాటు కోటి రూపాయల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, భారతీయ సంస్కృతికి అద్దం పట్టే హస్తకళ/ చేనేత వస్తువులను ప్రభుత్వం అందిస్తుంది.

## బ్రెగ్జిట్ ఒప్పంద తీర్మానం ఓటమి

★ ఐరోపా సమాఖ్య (EU - యూరోపియన్ యూనియన్) నుంచి వైదొలిగేందుకు బ్రిటన్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బ్రెగ్జిట్ ఒప్పంద తీర్మానాన్ని దిగువ సభ తిరస్కరించింది.

★ ఈయూ నుంచి వైదొలిగే విషయమై ఈయూ - బ్రిటన్ మధ్య 'ఉపసంహరణ ఒప్పందం' కుదిరింది. వైదొలిగిన తర్వాత ఇరుపక్షాలు ఎలా వ్యవహరించాలన్నదే ఈ ఒప్పంద తీర్మాన సారాంశం. దీని ఆమోదం కోసం ప్రధాని థెరిసా మే దిగువ సభ హౌస్ ఆఫ్ కామన్స్‌లో 2019 జనవరి 15న తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ 432 మంది, ఆమోదిస్తూ 202 మంది ఎంపీలు ఓటు వేశారు. దీంతో తీర్మానం 230 ఓట్ల తేడాతో ఓడిపోయింది.

★ ఈ నేపథ్యంలో థెరిసా మే ప్రభుత్వంపై ప్రతిపక్ష లేబర్‌పార్టీ నేత జెరెమీ కార్బిన్ జనవరి 16న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంలో థెరిసా మే 325 - 306 ఓట్ల తేడాతో గెలుపొందారు. దీంతో ప్రస్తుతానికి ఆమె పదవిలో కొనసాగనున్నారు.

## ప్రపంచంలో రెండో అతిపిన్న గ్రాండ్ మాస్టర్‌గా గుకేష్

★ తమిళనాడుకు చెందిన గుకేష్ 2019, జనవరి 15న దిల్లీ అంతర్జాతీయ చెస్ టోర్నీలో మూడో జీఎం నార్మ్ సంపాదించి గ్రాండ్ మాస్టర్ హోదా గెలుచుకున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల వయసులో గ్రాండ్ మాస్టర్ హోదా దక్కించుకున్న గుకేష్ ప్రపంచంలో ఈ ఘనత పొందిన రెండో పిన్న వయస్కుడు. మొత్తం మీద భారత్ తరఫున 59వ జీఎంగా అవతరించాడు.

★ 2002లో సెర్గీ కర్జాకిన్ (ఉక్రెయిన్) 12 ఏళ్ల 7 నెలలకే జీఎం అయ్యాడు. అతడి తర్వాత గుకేష్ అత్యంత చిన్న వయస్కుడు.

### మాదిరి ప్రశ్నలు

**1.** ప్రఖ్యాత అలహాబాద్ కుంభమేళా ఏ రోజున ప్రారంభమైంది?

1) 2019, జనవరి 14 2) 2019, జనవరి 15 3) 2019, జనవరి 16 4) 2019, జనవరి 17

**2.** ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, నాటక కర్త, అధ్యాపకుడు, విమర్శకుడు, పరిశోధకుడు ప్రొఫెసర్ మొదలి నాగభూషణ శర్మ 2019, జనవరి 16న ఎక్కడ మరణించారు?

1) కరీంనగర్ 2) తెనాలి 3) కర్నూల్ 4) విశాఖపట్నం

**3.** ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల (ఈఎంఆర్ఎస్) మొదటి జాతీయ క్రీడోత్సవాలను 2019 జనవరిలో ఎక్కడ నిర్వహించారు?

1) విజయవాడ 2) బెంగళూరు 3) హైదరాబాద్ 4) చెన్నై

**4.** పేదలకు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో జనరల్ కేటగిరీలో కల్పించిన 10 శాతం కోటా రిజర్వేషన్ ఏ రోజు నుంచి అమల్లోకి వచ్చింది?

1) 2019, జనవరి 13 2) 2019, జనవరి 14 3) 2019, జనవరి 15 4) 2019, జనవరి 16

**5.** మొదటి ఫిలిప్ కాట్లర్ ప్రెసిడెన్షియల్ పురస్కారాన్ని 2019 జనవరిలో ఎవరికి ప్రదానం చేశారు?

1) నరేంద్ర మోదీ 2) డొనాల్డ్ ట్రంప్ 3) వ్లాదిమిర్ పుతిన్ 4) ఇమ్రాన్ ఖాన్

**6.** ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) నాలుగో సీజన్ విజేతగా ఏ జట్టు నిలిచింది?

1) ముంబయి రాకెట్స్ 2) హైదరాబాద్ హంటర్స్

3) అవధె వారియర్స్ 4) బెంగళూరు రాప్టర్స్

**7.** కృష్ణానదిపై అమరావతి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.1387 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కూచిపూడి ఐకానిక్ వంతెనకు సీఎం చంద్రబాబు ఏ రోజున శంకుస్థాపన చేశాడు?

1) 2019, జనవరి 12 2) 2019, జనవరి 13

3) 2019, జనవరి 14 4) 2019, జనవరి 15

**8.** క్రికెట్ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా కిందివారిలో ఎవరికి 2019 జనవరిలో సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ) గౌరవ సభ్యత్వాన్ని అందించారు?

1) విరాట్ కోహ్లి 2) రవిశాస్త్రి 3) మహేంద్రసింగ్ ధోని 4) 1, 2

**వివరణ:** సచిన్ టెండూల్కర్, బ్రయాన్ లారా (వెస్టిండీస్) ల తర్వాత ఈ గౌరవం అందుకున్న ఆస్ట్రేలియేతర క్రికెటర్లు కోహ్లి, శాస్త్రినే కావడం విశేషం.

**9.** కింది అంశాల్లో సరైనవి గుర్తించండి.

ఎ) ఆస్ట్రేలియాలో జరిగిన మూడు వన్డేల ద్వైపాక్షిక సిరీస్‌ను టీమిండియా 2 -1తో కైవసం చేసుకుంది. దీంతో ఆస్ట్రేలియాలో మొదటిసారి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను భారత్ నెగ్గినట్లయింది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును ఎంఎస్ ధోని గెలుచుకున్నాడు.

బి) ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరిగిన రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 2-0తో, నాలుగు టెస్టుల సిరీస్‌ను 3-1తో టీమిండియా నెగ్గింది.

సి) ఒక్క ఫార్మాట్లో కూడా సిరీస్ కోల్పోకుండా ఆసీస్ పర్యటనను ముగించిన తొలి విదేశీ జట్టుగా భారత్ రికార్డులకెక్కింది.

1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే 3) ఎ, సి మాత్రమే 4) అన్నీ

**వివరణ:** ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరిగిన రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ 1-1తో సమం కాగా, నాలుగు టెస్టుల సిరీస్‌ను 2-1 తో టీమిండియా నెగ్గింది.

**10.** జాతీయ పశుగణ నివేదిక - 2018 ప్రకారం దేశంలో గొర్రెల సంఖ్య, మాంసం వినియోగంలో ఏ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది?

1) తెలంగాణ 2) రాజస్థాన్ 3) ఉత్తర్ ప్రదేశ్ 4) ఆంధ్రప్రదేశ్

**11.** ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఉన్న అత్యంత ఎత్తైన శిఖరాలు అధిరోహించిన మొదటి భారతీయ సైనికాధికారిగా ఇటీవల ఎవరు రికార్డు సృష్టించారు?

1) కర్నల్ అజయ్ సింగ్ 2) కర్నల్ గోకుల్ దాస్

3) కర్నల్ రణ్‌వీర్ జామ్‌వాల్ 4) కర్నల్ అతుల్ సిన్హా

## జవాబులు

1–2; 2–2; 3–3; 4–2; 5–1; 6–4; 7–1; 8–4; 9–3; 10–1; 11–3.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**